ప్రజాశక్తి
ఆదివారం 12 అక్టోబర్ 2025
5
విజయనగరం





పనులు పరిశీలిస్తున్న ఇండస్ట్రీస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్పెషల్ సిఎస్ కృష్ణబాబు, మెయిన్‌లో

గడువులోగా భోగాపురం విమానాశ్రయం పూర్తి

నిలిచిన ఎన్‌టిఆర్ వైద్యసేవలు



- రూ.35 కోట్ల బకాయిలు చెల్లింపుపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఇబ్బంది పడుతున్న రోగులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

- ఎస్. కోట మండలం తలారి గ్రామానికి చెందిన కొరువాడ సూర్యంకు ఎముకులకు సంబంధించి ఆపరేషన్ చేయాల్సి ఉంది. ఎన్‌టిఆర్ వైద్య సేవలను ప్రయివేటు ఆసుపత్రి యాజమాన్యాలు నిలిపియడంతో ఆపరేషన్‌ను వాయిదా వేయించుకోవాలి వచ్చింది.

- విజయనగరం మండలం దుప్పాడ గ్రామానికి చెందిన నాగమణి చెవికి ఎన్‌టిఆర్ వైద్య సేవలు ద్వారా ఆపరేషన్ చేయాల్సి ఉంది. ప్రయివేటు యాజమాన్యాలు వైద్య సేవలను నిలిపివేయడంతో ఆపరేషన్, వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

వీరిద్దరే కాదు జిల్లా వ్యాప్తంగా అనేక మంది రోగులు ఎన్‌టిఆర్ వైద్య సేవల ద్వారా ఆపరేషన్ చేయించుకోవాల్సి ఉన్నప్పటికీ ప్రయివేటు ఆసుపత్రులు వైద్య సేవలను నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 15నెలలైనా బకాయిపడ్డ బిల్లులను ప్రభుత్వం చెల్లించక పోవడంతో విజయనగరం జిల్లాలోని 19 ప్రయివేటు ఆసుపత్రులు ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేశాయి.దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తొలినుంచి ఎంప్లాయీస్ హెల్త్ స్కీం, ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. విజయనగరం జిల్లాలో 36 ఆస్పత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవలు అందించేందుకు అనుమతులు ఉండగా, ఇందులో పది ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయి. మిగతా 26ఆసుపత్రులకు గాను 19 ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలను అందిస్తున్నారు. ప్రభుత్వం వైద్య సేవలకు బకాయినుచెల్లించకపోవడంతో ప్రయివేటు ఆసుపత్రుల యజమానులు నిలిపివేశారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా 3257 రోగాలకు వైద్య సేవలు అందిస్తారు. ప్రతిరోజూ ఎన్‌టిఆర్ వైద్య సేవ ఆసుపత్రులకు సుమారు 3వందలు ఒపి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రులకు సుమారు రూ. 35 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. యాజమాన్యాలు ఎన్‌టిఆర్ వైద్యసేవలను నిలిపివేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆరోగ్య మిత్ర ద్వారా ప్రభుత్వాసుపత్రులకు తరలిస్తున్నాం

విజయనగరం జిల్లాలో 36 ఎన్టీఆర్ వైద్య సేవ ఆసుపత్రులు ఉన్నాయి. అందులో పది ప్రభుత్వాసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలను అందిస్తున్నారు. 26 ప్రైవేట్ ఆసుపత్రులకు గాను 19 ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యసేవలను నిలిపివేయడం వాస్తవమే. ప్రజలకు ఎటువంటి వైద్యం అవసరమైనా ఆరోగ్య మిత్రులను సంప్రదిస్తే 104, 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలను అందిస్తాం.



కుప్పిలి సాయిరాం
ఎన్‌టిఆర్ వైద్య సేవల జిల్లా కోఆర్డినేటర్, విజయనగరం

బాలికా విద్య సమాజాభివృద్ధికి మూలాధారం

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి-గజపతినగరం, బొండపల్లి

సమాజంలో బాలికా విద్య సమాజ అభివృద్ధికి మూలాధారమని, సమాజ గమనాన్ని మహిళలు తీర్చిదిద్దగలుగుతారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బొండపల్లి మండలం ఒంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జరిగిన సభకు మంత్రి కొండపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు ఏ రంగంలోనూ మగవారికి తీసిపోరని, బాలికలకు సక్రమమైన విద్యను అందించగలిగితే అన్ని రంగాల్లో రాణించగలరన్న విషయం ఇప్పటికే అనేకమార్లు రుజువైందని మంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. సుకన్య సమృద్ధి యోజన పథకం కింద ఒంపల్లి గ్రామానికి చెందిన పలువురికి పోస్టాఫీసులో అకౌంట్లు ప్రారంభించి మొదటి నెల మొత్తాన్ని రూ.30వేలు మంత్రి స్వయంగా చెల్లించారు. ఈ అకౌంట్లకు ఒక్కొకరు నెలకు రూ.5వేలు వంతున సక్రమంగా చెల్లించుకుని భవిష్యత్తులో ఆ బాలికల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. గంట్యాడ మండలం గుడివాడకు చెందిన బర్ల ప్రసన్నకుమార్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో మూడేళ్ల పాటు ప్రీమియం చెల్లించి అకాల మరణం చెందిన నేపథ్యంలో ఆయన భార్య బర్ల ఎరినమ్మకు రూ. 6,17,983 ఇన్సూరెన్స్ చెక్కును మంత్రి అందజేశారు. ఎఎంసి చైర్మన్ గోపాలరాజు, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్, డిప్యూటీ డిఎం అండ్‌హెచ్‌ఒ సూర్యనారాయణ, ఒంపల్లి సర్పంచ్ నారాయణమ్మ, తహశీల్దార్ రాజేశ్వరి, ఎంపిడిఒ గిరిబాల, డివిజనల్ పోస్టల్ ఇనస్పెక్టర్ ఉపేంద్ర, సిడిపిఒ ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

జెండర్ రిసోర్సు సెంటర్ ప్రారంభం

బొండపల్లి మండల సమాఖ్య ఏర్పాటు చేసిన జెండర్ రీసోర్స్ సెంటర్‌ను రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస పాణి, ఎపిడి కె.సావిత్రి, డిపిఎం హెచ్ రవికుమార్, ఎపిఎం విశ్వేశ్వర రావు, సిసిలు పాల్గొన్నారు.



సిఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

నియోజకవర్గంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య చికిత్సలు నిమిత్తం సిఎం సహాయ నిధి నుండి రూ.10.70లక్షలు బాధిత కుటుంబాలకు పార్టీ కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కూటమి ప్రభుత్వం పేదల కుటుంబాలకు అనేక రకాలుగా అధిక ప్రాధాన్యత ఇస్తోందని, వైద్య రంగానికి సంబంధించి గడిచిన 15 నెలల్లో పలుదఫాలుగా వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, ఎఎంసి చైర్మన్ పివివి గోపాల రాజు, మండల పార్టీ ఉపాధ్యక్షులు మజ్జి గోవింద, పిఎసిఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, మండల సీనియర్ నాయకులు లెంక చిన్నం నాయుడు, వివి ప్రదీప్ కుమార్, సత్తిబాబు, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి రైతు మృతి

ప్రజాశక్తి- రేగిడి



రైతు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మండలం నాయిరాలవలస పంచాయతీ పరిధి రెడ్డి పేట గ్రామంలో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఒక్కసారిగా పిడుగు పడి కోవగాన నాయుడు (45) అనే రైతు మృతి చెందారు. గత రెండు రోజులుగా గ్రామ సమీపంలో మొక్కజొన్న పిక్కలు ఆరేశారు. శనివారం వర్షం పడడంతో మొక్కజొన్న పిక్కలపై టార్పాలిన్ కప్పుతుండగా ఒక్కసారిగా పిడుగుపడి నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. భార్య సుగుణ స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. మృతదేహాన్ని పంచనామా చేసి రాజాం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు ఖాళీ సమయంలో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య సుగుణతో పాటు ఇద్దరూ కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

కొద్దిపాటి వ్యవసాయంతోనే జీవనం

గ్రామంలో ఉన్న కొద్దిపాటి వ్యవసాయం చేసుకొని కుటుంబంతో జీవనం సాగిస్తున్న తరుణంలో ఇలా అర్థాంతరంగా మృత్యువాత పడడం ఆ కుటుంబ సభ్యులు రోధన వర్ణాతీతం. ప్రభుత్వం ఈ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతున్నారు.

డిఎస్‌డిఒగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా ఎస్.వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 23 జిల్లాలకు కొత్త డిఎస్‌డిఒలను నియమించింది. విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాకు డిఎస్‌డిఒగా వ్యవహరించిన శ్రీధర్‌ను మన్యం జిల్లాకు నియమించగా, ఇటీవం విశాఖపట్నం బదిలీపై వెళ్లిన ఎస్.వెంకటేశ్వరరావును తిరిగి విజయనగరం జిల్లా కు నియమిస్తూ ఆదేశాలు ఇచ్చింది. సోమవారం ఆయన విధుల్లో చేరనున్నారు.

రాజకీయం చేయడం సరికాదు

- బొత్స అంటే మాకు గౌరవమే
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నాగార్జున

తనపై కక్ష సాధింపుచర్యలు చేపడుతున్నారని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించడం, సిరిమానోత్సవం సందర్భంగా వేదిక కూలిపోయిన ఘటనను రాజకీయం చేయడం సరికాదని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిమానోత్సవం రోజు వారు కూర్చున్న వేదిక కూలిపోయిన విషయాన్ని బొత్స సత్యనారాయణ రాజకీయ కోణంలో చూడడం సరికాదని అన్నారు. సిరిమానును తిలకించేందుకు స్థలం కావాలని తమకు మూడు రోజులు ముందు లేఖ పంపితే దానికి అనుగుణంగా అర్బన్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. అక్కడ వారి మనుషులే టెంట్ వేసుకొని, దానికి పార్టీ రంగు కట్టుకొని ఏర్పాటు చేశారని తెలిపారు. క్లాత్ వేసుకోవడంలో ఉన్న శ్రద్ధ వేదిక విషయంలో తీసుకోలేదన్నారు. పండగ ఘనంగా జరగడం, తమ పార్టీకి మంచి పేరు రావడంతో ఏమీ మాట్లాడలేక నిందలు వేస్తున్నారని అన్నారు. 25మంది కూర్చోవాల్సిన వేదికపై 50 మంది కూర్చోవడంతో వేదిక ఒరిగిపోయిందే తప్ప కూలిపోలేదని చెప్పారు. రాజకీయ సుదీర్ఘ అనుభవం ఉన్న బొత్స అంటే తమకు గౌరవమేనని అన్నారు. నిద్రహారాలు మానేసి శ్రమించిన అధికారులను నిందించకుండా వారిని అభినందించాలన్నారు. ప్రభుత్వం నుంచి సరస్ నిర్వహణకు రూ.1.26కోట్లు, ఉత్సవాల్లో యూత్ ఫెస్టివల్‌కు మరో రూ.50లక్షలు, దేవాదాయశాఖ ద్వారా పండగ నిర్వహణకు రూ.50లక్షలు, కార్పస్ ఫండ్ (డొనేషన్ల ద్వారా) రూ.80లక్షలు వచ్చిందని మంత్రి తెలిపారు.

జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం వెళ్లి మెడికల్ కాలేజీ విషయంలో అవాస్తవాలు చెప్పి ప్రజలను గందరగోళం పర్చడం సరికాదన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో 1995 నుంచి 2004 వరకు 19 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందన్నారు. 2014-19 వరకు 8 మెడికల్ కాలేజీలు స్థాపించామన్నారు. వైసిపి ప్రభుత్వం 17 కాలేజీలకు రూ.8500 కోట్లు వెచ్చించి కేవలం ఆరు కాలేజీలు మాత్రమే పూర్తి చేసిందన్నారు. పార్వతీపురం మెడికల్ కాలేజీకి ఇంకా భూసేకరణ జరగలేదన్నారు. సమావేశంలో టిడిపిజిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున ఉన్నారు.

విద్యుత్తు ఉద్యోగుల సామూహిక సెలవు లేఖ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ మూడో దశ పోరాటంలో భాగంగా ఈనెల 13న చలో విజయవాడ మహాధర్నాకు వెళ్లేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం సర్కిల్ నుండి వందలాది మంది ఉద్యోగులు తమ విధులకు స్వచ్ఛందంగా సామూహిక సెలవులు పెట్టి బయలుదేరుతున్నారు. శనివారం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.త్రినాధరావుకు సెలవు లేఖను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన దీర్ఘకాలిక ఉద్యోగులు సమస్యలు పరిష్కరించడంలో ట్రాన్స్‌కో యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని అన్నారు. అనేక దఫాలుగా జరిగిన చర్చల్లో పురోగతి లేదని, దీంతో గత్యంతరం లేని పరిస్థితి లో 13న చలో విజయవాడ, 14న వర్క్ టు రూల్, 15 నుండి నిరవధిక సమ్మెకు సిద్ధమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ ఉద్యోగుల జె ఎ సి చైర్మన్ సురగాల లక్ష్మణ్, కన్వీనర్ బండారు రాజేష్ కుమార్, కోచైర్మన్ పి.అప్పలస్వామినాయుడు, వైస్‌చైర్మన్ మందపల్లి నిర్మలమూర్తి, బిసి ఉద్యోగుల నాయకులు రుంకాన అప్పల నాయుడు, కెవివి సత్యనారాయణ, సీతారామ రాజు పాల్గొన్నారు.



సైన్సు టాలెంట్‌టెస్టు పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఇఒ మాణిక్యంనాయుడు, జెవివి నాయకులు

18న చెకుముకి సైన్స్ పరీక్ష

విద్యార్థుల్లో జిజ్ఞాసను పెంచేందుకు దోహదం : డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచి, విషయ పరిజ్ఞానం పట్ల జిజ్ఞాసను పెంచటానికి జన విజ్ఞాన వేదిక నిర్వహించే 'చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష దోహదం చేస్తుందని జిల్లా విద్యా శాఖాధికారి యు. మాణిక్యం నాయుడు అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ విషయమై జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా నాలుగు స్థాయిల్లో నిర్వహిస్తున్న 'చెకుముకి సైన్స్ సంబరాలు' గోడ పత్రికను ఆయన శనివారం జెవివి నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి నాయకులు వి. రాజగోపాల్ మాట్లాడుతూ 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే చెకుముకి పరీక్ష, స్కూల్ స్థాయిలో అక్టోబర్ 18న, మండల, పట్టణ స్థాయిలో నవంబర్ 1న, జిల్లా స్థాయిలో నవంబర్ 23న, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 12,13,14 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయి సంబరాల్లో విద్యార్థులకు సైంటిస్టులతో ముఖాముఖీ, విజ్ఞాన, విహార యాత్ర వుంటాయని, రూ.10 రుసుము చెల్లించి జిల్లాలో వున్న ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులందరూ ఈ చెకుముకి సంబరాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో విద్యార్థులంతా పాల్గొనేలా ప్రోత్సాహించాలని అన్ని విద్యాసంస్థలకు రాష్ట్ర పాఠశాల విద్యా శాఖా డైరెక్టర్ సూచించారని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని స్కూల్స్‌కు సమాచారం అందజేయా లని డిఇఒకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు, చీకటి దివాకర్, కె. మురళి బాబు, కె.శశిధర్, ఆదినారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సవాల తీరుపై అఖిల పక్షం నిర్వహించాలి

కంటోన్మెంట్ : ప్రతిష్టాత్మ మైన విజయనగరం ఉత్సవాలు జరిగిన తీరు, నిర్వహించిన అధికారుల ఆలోచనలు, జరిగిన పొరపాట్లు పై జిల్లా కలెక్టర్, రాంసుందర్ రెడ్డి,మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యాన రాజకీయ పార్టీలు,ఉత్సవ కమిటీ లైఫ్ మెంబర్లు, పాత్రికేయుల సమక్షంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చెయ్యాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు

ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించాలి

పట్టణ పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదలకు వైద్యం అందాలంటే వైద్య విద్య, ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎల్ బి జి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగాన్ని పూర్తిగా పి పి పి మోడల్ లో ప్రైవేటు వ్యక్తులు చేతుల్లో పెట్టి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోవడానికి చూస్తోందన్నారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే ఐదు కాలేజీలు ప్రారంభించిందన్నారు కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేయాలని చూడటం సరికాదన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ జరిగితే వైద్య విద్య పేద విద్యార్థులకు భారంగా మారనుందన్నారు. ఫీజులు కట్టుకోలేక పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. దీంతో పాటు వైద్యం కూడా మరింత ఖరీదుగా మారిందన్నారు. మరో వైపు ప్రైవేటు ఆసుపత్రులకు ఆరోగ్య శ్రీ నిధులు మంజూరు చేయకపోవడం వలన వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పి హెచ్‌సి వైద్యుల సమస్యలు పరిష్కరించివ వారి సమ్మెను విరమింపజేయాలని అన్నారు. ప్రజారోగ్య వ్యవస్థను కాపాడుకునేందుకు , ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని కోరుతూ ఈనెల15న విజయనగరంలో జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజలు,ప్రజా సంఘాలు నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గోడ పత్రికను విడుదల చేశారు. సమావేశంలో నాయకులు యు ఎస్ రవికుమార్, ఎం.సుధీర్, సతీష్ లు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

మరణాలపై బుకాయింపు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'అసలే గిరిజన విద్యార్థుల సంక్షేమంపై అంతులేని నిర్లక్ష్యం. ఆ పై బుకాయింపు... అంతటితో ఆగారా?? ఆ మరణాలను విద్యార్థుల తల్లిదండ్రులపైకి నెట్టేయడం... దీన్నిబట్టి చూస్తుంటే గిరిజనుల సంక్షేమం ప్రభుత్వానికి సంబంధం లేదన్నట్టుగా ఉంది' అంటూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యాఖ్యలపై గిరిజనులు చర్చించుకుంటున్నారు. ఈ పాటి బాధ్యత వహించలేనివారికి మంత్రి పదవి అవసరమా? అని కూడా గిరిజనం రగిలిపోతోంది. కురుపాం ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు తోయక అంజిలి సెప్టెంబర్ 26న, తోయక కల్పన ఈనెల 1వ తేదీన తీవ్ర అస్వస్థతతో మృతి చెందిన సంగతి తెలిసిందే. వీరితోపాటు చాలా మంది ఆసుపత్రి పాలయ్యారు. గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో కలుషిత తాగునీరు కారణంగా ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం, వందలాది మంది పచ్చకామెర్లతో ఆస్పత్రుల పాలవ్వడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఆదివాసీ సమాజానికి విద్యా అవకాశాలు కల్పించాలని ఏర్పాటైన ఆశ్రమ పాఠశాలలో ఇటువంటి విషాదకర సంఘటనలు జరగడం పట్ల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంగతి కాస్త అటుంచితే... వరుస మరణాలపై ఎట్టకేలకు స్పందించిన గురుకులాల సంక్షేమ కార్యదర్శి ఎం.గౌతమి ఈనెల 4వ తేదీన వసతి గృహాన్ని సందర్శించారు. 5వ తేదీన కెజిహెచ్‌లో వైద్యసేవలు పొందుతున్న ఇతర విద్యార్థినులను పరామర్శించారు. అప్పటి వరకు అమాత్యులవారికి గుర్తుకు రాలేదు. హడావుడిగా గౌతమితో పాటు కెజిహెచ్‌కు వెళ్లారు. తాగునీరు బాగుందని, వాటర్ ప్లాంట్ బాగానే పనిచేస్తుందని అక్కడ మంత్రి ప్రకటించారు. వాస్తవానికి మంత్రి వసతి గృహానికి వెళ్లకుండానే ఈ ప్రకటనతో బుకాయించారు. ఇందుకు నిరదర్శనం లేకపోలేదు.ఈ ప్రకటనకు ముందు రోజే గురుకులాన్ని సందర్శించిన ఐఎఎస్ ఆఫీసర్ గౌతమి తాగునీటి కలుషితం వల్లే విద్యార్థుల మరణాలు, అనారోగ్యాలకు



కారణమయ్యాయని స్పష్టంగా ప్రకటించారు. అంతే కాదు ఈనెల 7వ తేదీన స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కొత్తవాటర్ ప్లాంట్‌ను కూడా ఓపెన్ చేశారు. మంత్రి బుకాయించారు అనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏముంటుందని గిరిజనుల్లో చర్చనడుస్తోంది. నిజంగా మంత్రి చెప్పింది వాస్తవమైతే ఎమ్మెల్యేగారు కొత్తప్లాంట్ ఓపెన్ చేయాల్సిన అవసరం ఏముంది. అంటే ఎమ్మెల్యే ఊరకే ప్రజల్లో మెప్పుకోసం హడావుడి చేశారా? పోనీ దానిపైనైనా మంత్రి స్పందించారా అంటే అదీ లేదు. అంతెందుకు రెండు విద్యాకుసుమాలు రాలిపోయిన ఆ కురుపాం గురుకులాన్ని మంత్రి ఇప్పటికీ సందర్శించలేదు. చివరకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చన్నాయుడికి ఉన్నంత శ్రద్ధ కూడా లేకపోయిందా? అంటూ గిరిజనుల నోట వినిపిస్తోంది. జిల్లా తరపున మంత్రి పదవి చేపట్టి, అందులోనూ గిరిజన సంక్షేమశాఖ బాధ్యతలో ఉండి, ఇంత నిర్లక్ష్యం ప్రదర్శించడమే కాకుండా, దసరా సెలవులకు ఇళ్లకు వెళ్లడం వల్ల అక్కడే అనారోగ్యాలకు గురైనట్టు చెప్పడం ఎంత వరకు సమంజసమని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. గిరిజన వసతి గృహాలకే బాధ్యత వహిస్తారా? ఇళ్ల వద్ద అనారోగ్యానికి గురైతే మంత్రికి బాధ్యత లేదా? అని జనం మాట. వాస్తవానికి మంత్రి గడిచిన రెండు లేదా ముడు నెలల్లో ఒక్క సంక్షేమ వసతి గృహాన్నైనా సందర్శించారా అంటే గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నీళ్లు నములుతున్నారు. మరి మంత్రిగారికే తీరికలేకపోతే పర్యవేక్షణ ఎలా ఉంటుంది. మొత్తం వ్యవహారానికి బాధ్యత వహించాల్సిన మంత్రి తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపాన్ని వార్డెన్లు, వైద్య సిబ్బందిపైకి నెట్టేస్తున్నారనే వాదన కూడా ఉంది. స్థానిక ఎమ్మెల్యే లేక మంత్రి వసతి గృహాల్లో పర్యవేక్షణ చేస్తే సిబ్బంది అప్రమత్తం అయ్యేవారు. కురుపాం గిరిజన గురుకులంలోని వాటర్ ప్లాంట్ సమస్య వెలుగులోకి వచ్చేది. ఆ ముక్కుపచ్చలారని ఆ ఇద్దరు చిన్నారులూ ప్రాణాలతో ఉండేవారు. అటువంటి శ్రద్ధ చూపకుండా మొత్తం వ్యవహారానికి బాధ్యులను చేస్తూ స్థానిక వార్డెన్, ఎఎన్ఎంలను సస్పెండ్ చేయమంటే చేను చెల్లుపోయాక కళ్లం కాపు కాసినట్టేని పబ్లిక్ టాక్.



మహాసభల జయప్రదానికి ప్రభాతభేరి నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

మద్యం, డ్రగ్స్ నిషేధించాలి

ప్రభాతభేరిలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి వాటిని నిషేధించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ డిమాండ్ చేశారు. మహిళా హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా)16 వ రాష్ట్ర మహాసభలు ఈనెల 13,14,15తేదీల్లో అనంతపురంలో జరుగుతున్న నేపథ్యంలో సభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ఉదయం 5 గంటలకు ప్రభాత భేరి కార్యక్రమం ఎల్ బి జి నగర్, వినాయక నగర్ చుట్టూ ఉన్న కాలనీలలో నిర్వహించారు ఈ సందర్భంగా రమణమ్మ మాట్లడుతూ జిల్లాలో గంజాయి, అక్రమ మద్యం విచ్చల విడిగా అమ్ముతున్నారని, వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు పుణ్యవతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్‌కు విశేస స్పందన

విజయనగరంకోట: సంగీత కళాశాలలో జిఎస్‌టి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ సేల్స్ కు వినియోగదారుల నుండి విశేష స్పందన లభించిందని జిఎస్‌టి జాయింట్ కమిషనర్ నిర్మల జ్యోతి పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషనలో ప్రజలు తక్కువ ధరలకు నాణ్యమైన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా సుమారు రూ.25వేలు పైగా లబ్ధి పొందినట్లు ఆమె తెలిపారు. శనివారం ఆమె ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.



మీ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిటిసి తులసి, భారతి

ఇంటర్నెట్, మీ సేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో శనివారం స్టేట్ బ్యాంకు ఎదురుగా ఇంటర్నెట్, మీసేవ కేంద్రాన్ని బానాది ఎంపిటిసి గొంప తులసి ప్రారంభించారు. గతంలో పనిచేసిన మీ సేవా కేంద్రాలు మూతపడడంతో ప్రజలకు మళ్లీ మీ సేవలు అందుబాటులో ఉండే విధంగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ ప్రత్యేక శ్రద్ధతో కోటాన బంగారమ్మ పేరున అరవింద్ ఇంటర్నెట్ మీసేవ కేంద్రాన్ని ప్రారంభించేలా కృషి చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, వేపాడ మండల మహిళా సంఘాల చైర్మన్ గొంప తులసి మాట్లాడుతూ వేపాడ మండల కేంద్రంలో ఇంటర్నెట్ మీసేవ కేంద్రాలు లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బంది పడేవారని నేటితో ఆ ఇబ్బందులు తొలగపోయాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు రైతు సంఘ ఉపాధ్యక్షుడు సిరికి రమణ, కోపరేటివ్ డైరెక్టర్ మంచిన అప్పలసూరి, ఉపాధ్యాయులు గుమ్మడి నరసింహమూర్తి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సిపిఆర్‌తో ప్రాణాలను కాపాడుకోవచ్చు



సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

బొబ్బిలి: సిపిఆర్‌తో ప్రాణాలను కాపాడు వచ్చునని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల నర్సింగ్ ప్రిన్సిపాల్ సిబా ఫ్రాన్సిస్ అన్నారు. స్థానిక అభయ ఆసువత్రిలో శనివారం బొబ్బిలి, సాలూరు ప్రాంత వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులకు నర్సింగ్ వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఆర్ చేసే విధానం, డిఫిబ్రిలేటర్ వాడవాల్సిన పద్ధతిపై అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన వారికి వెంటనే సిపిఆర్ చేస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చునని ఫ్రాన్సిస్, వైద్యులు శివ అన్నారు. కార్యక్రమంలో వైద్యులు బూరి అనిల్ కుమార్, రాజేష్ కుమార్, దినేష్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు బొర్రా మృతి

ప్రజాశక్తి- గజపతినగరం



సీనియర్ పాత్రికేయుడు, ఎపియుడబ్ల్యూజె జిల్లా మాజీ అధ్యక్షుడు బొర్రా సత్యనారాయణ(80) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలు, అనారోగ్యంతో విజయనగరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్న సత్యనారాయణ రాత్రి పదిన్నర గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. ఆయన ఆంధ్రభూమి, ఈనాడు పత్రికకు సుదీర్ఘకాలం గజపతినగరం విలేకరిగా పనిచేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లా ఎపిడబ్ల్యూజె అధ్యక్షునిగా కూడా సేవలందించారు. ఆయన కుమారుడు నరసింగరావు, అల్లుడు నాగరాజు కూడా పాత్రికేయ రంగంలో పనిచేస్తున్నారు. .సత్యనారాయణ మృతి పట్ల జెడ్‌పిటిసి గార తౌడు, వైసిపి నాయకులు బెల్లాన త్రినాధరావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, సిపిఎం నాయకులు రాకోటి రాములు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జర్నలిస్టు సంఘాల నాయకులు కె.రమేష్‌నాయుడు, శివప్రసాద్, రాజు, పంచాది అప్పారావు మహాపాత్రో, శర్మతదితరులు సంతాపం తెలిపారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

గజపతినగరం : మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి కోటి సంతకాల సేకరణ చేపడుతుందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న విధానం వల్ల పేద విద్యార్థికి వైద్య విద్య భారం అవుతుందని చెప్పారు. ప్రతి గ్రామంలో ప్రజలను చైతన్యవంతులను చేసి ఈనెల 10 నుంచి 22వ తేదీ వరకు రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి కోటి సంతకాల సేకరణ చేస్తామని తెలిపారు. ఈ నెల 28న గజపతినగరంలో ర్యాలీగా వెళ్లి తహశీల్దార్కి వినతి పత్రాలు అందజేస్తామన్నారు. నవంబర్ 12వ తేదీన వైసిపి నియోజకవర్గ ఇంఛార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, నాయకులు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. నవంబర్ 26 న రాష్ట్ర మొత్తం మీద సంతకాల సేకరణ చేసి జగన్మోహన్ రెడ్డితో కలిసి గవర్నర్‌ను కలుస్తామని తెలిపారు. అనంతరం 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మొదటి సంతకం చేశారు. ఈనెల 13వ తేదీన గజపతినగరం ఎక్సైజ్ స్టేషన్ ఎదురుగా తమతో పాటు, నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో బెల్ట్ షాపులకు, మద్యం మాఫియాకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్ బాబు, 5 మండలాలు జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

టిడిపి మండల కార్యాలయం ప్రారంభం

వంగర: మండల కేంద్రంలో టిడిపి నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శనివారం ప్రారంభించారు. అనంతరం మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామానికి చెందిన చింతలూరి నీలకంఠేశ్వరరావు అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని, దేశంలో కోటి మందికి పైగా కార్యకర్తలకు ప్రమాద బీమా సౌకర్యాన్ని అందిస్తున్న ఏకైక రాజకీయ పార్టీగా టిడిపి చరిత్ర సృష్టించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

మాజీ ఎమ్మెల్యేను కలిసిన దవళ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును వైఎస్ఆర్ కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ధవళ లక్ష్మణరావు శనివారం ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ కార్మికుల తరుపున పని చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు, జడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరంలో గత ఏడాది కాలంలో 286 మద్యం నమూనాలను సేకరించామని అబ్కారీ శాఖ విజయనగరం వన్ టౌన్ సిఐ కె.మన్మధరావు తెలిపారు. శనివారం నగరంలోని పలు మద్యం బార్ షాపులను తనిఖీ చేశారు. రాష్ట్రంలో నూతన మద్య విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి నాణ్యమైన మద్యం అందించేందుకు ఎప్పటికప్పుడు మద్యం షాపులు, బార్లలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్కడికక్కడే నమూనాలను పరీక్షించి ఆ తరువాత నమూనాలను రసాయన విశ్లేషణ నిమిత్తం విశాఖపట్నంలో గల ఎక్సైజ్ లేబరేటరీకి పంపిస్తామన్నారు. ఇందులో భాగంగా గత అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు 286 నమూనాలను సేకరించి నివేదికలను తెప్పించామన్నారు. నివేదికలో ఇచ్చిన వివరాలను బట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ సరఫరా చేస్తున్న మద్యం పూర్తి నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్నట్లుగా వెల్లడైందన్నారు. ఇక మీదట కూడా ప్రతి నెల అన్ని షాపుల్లో నమూనాలను సేకరించి పరీక్షించడం ద్వారా మద్యం నాణ్యతను తెలుసుకుంటా మన్నారు. వినియోగదారులకు ఎవరికైనా మద్యం నాణ్యతకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే మా టోల్ ఫ్రీ నెంబరు 14405 కి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు

భోగాపురం: భోగాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన మద్యం దుకాణాలను ఆ శాఖ సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. షాపుల్లో ఉన్న మద్యం నిల్వలను, మద్యం బ్రాండ్ల, రికార్డులు పరిశీలించామని నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్నాయని ఆయన తెలిపారు. నాలుగు మద్యం దుకాణాల నుంచి సాంపిల్స్ తీసి విశాఖలో ఉన్న ల్యాబ్‌కు పంపించామన్నారు. మద్యం విక్రయాల్లో తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే 14405 నెంబర్‌కు తెలియజేయాలని ప్రజలను కోరారు. తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఇందిరా దేవి, ఎస్ఐ వై.చంద్రమోహన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస: కొత్తవలస ఎక్సైజ్ సిఐ రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో మద్యం షాపుల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం కొత్తవలస ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల అన్ని బ్రాందీ షాపులను, అనుమానస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. స్టేషన్ పరిధిలో ఎటువంటి అక్రమ మద్యం లేదని ప్రభుత్వం నెల్లిమర్ల డిపో నుండి సరఫరా చేస్తున్న మద్యం అందుబాటులో ఉందని తెలిపారు. క్వాలిటీ కోసం స్పాట్లోనే టెస్టులు చేస్తున్న నమూనాలు సేకరించి వైజాగ్ కెమికల్ ఆఫీస్‌కి పంపించామన్నారు.



మద్యం తనిఖీ చేస్తున్న సిఐ మన్మధరావు

నెల్లిమర్ల: మద్యం నాణ్యత పై అనుమానం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14405కి ఫిర్యాదు చేయవచ్చని నెల్లిమర్ల ఎక్సైజ్ సిఐ ఎం. వెంకట్రావు శనివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి నాణ్యమైన మద్యం అందించేందుకు ప్రభుత్వం, ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ నిబద్ధతతో పనిచేస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా ఎప్పటికప్పుడు ప్రతి స్టేషన్ పరిధిలో మద్యం షాపులు, బార్ల నందు పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించంతా అక్కడికక్కడే నమూనాలను పరీక్షించి రసాయన విశ్లేషణ నిమిత్తం విశాఖపట్నంలో గల ఎక్సైజ్ లేబరేటరీ కి పంపిస్తున్నామని చెప్పారు. గత అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు మద్యం నమూనాలను సేకరించి నివేదికలను తెప్పించామని నివేదికలో ఇచ్చిన వివరాలను బట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ సరఫరా చేస్తున్న మద్యం పూర్తి నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్నట్లుగా వెల్లడైందన్నారు.

గవాయ్‌పై దాడి దారుణం

ప్రజాశక్తి - వేపాడ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై జరిగిన మతోన్మాద దాడిని దేశంలో ప్రజలందరూ ఖండించాలని ఇది దారుణమని సిపిఎం నాయకుడు చల్లా జగన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో దాడికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవాయిపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై, భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా గుర్తించాలన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి దాడులు పెచ్చు మీరుతున్నాయని అన్నారు. బిజెపి, తన మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ ఇలాంటి అరాచక మూకలకు సహకారంగా నిలుస్తున్నాయని అన్నారు. సుప్రీంకోర్టు సాక్షిగా ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై బూటుతో దాడి చేయడం హేయమైన చర్య అని దేశ చరిత్రలోనే ఇది మాయని మచ్చ అని అన్నారు. ఈ దాడికి పాల్పడిన మతోన్మాద న్యాయవాదిని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దబ్బరాజుపేట మాజీ సర్పంచ్ ఏరువాక అప్పలనాయుడు, ఆటో కార్మికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: బిఆర్ గవాయ్‌పై మనువాద సిద్ధాంతాన్ని నర నరాన్న ఎక్కించుకున్న లాయర్ షూ విసరడాన్ని ఖండిస్తూ కోరాడ వీధి జంక్షన్లో శనివారం నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా నాయకులు పి.శంకర్రావు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ఎవరు అవమానపరిచినా అంగీకరించం అని హెచ్చరిస్తూ ఆ సీనియర్ లాయర్ మాట్లాడం విచారకరమన్నారు. మన న్యాయ వ్యవస్థకు రాజ్యాంగానికి తీవ్రమైన ప్రమాదం ఏర్పడిందని మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపై ఉందని అన్నారు. ఒక లాయరు ఉన్నతమైన చదువు చదివి సమాజాన్ని ముందుకు నడపాల్సిన వ్యక్తి ఆర్ఎస్ఎస్, బిజెపి మత ఉన్మాదాన్ని వంటికి ఎక్కించుకొని ఈ ఉన్మాదానికి పాల్పడ్డారని అన్నారు. మేధావులు, రాజ్యాంగ పరిరక్షకులు ఈ చర్యను ఖండించాలని ఆ లాయర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.యుగంధర్, జి.గౌరీ, జి.వాసు, బి. వెంకటి కార్యకర్తలు పాల్గొన్నారు.

పాట మనిషి జీవనానికి గమనం

జెవివి నాయకులు కృష్ణాజి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాట మనిషి జీవనానికి గమనాన్ని, పోరాటాలకు స్ఫూర్తిని ఇస్తుందని జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజి అన్నారు. గురజాడ పాఠశాలలో శనివారం జెవివి ఆధ్వర్యానఉపన్యాస కళాజాత రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కృష్ణాజి మాట్లాడుతూ భారతదేశంలో అనాది కాలం నుండి పాటకు ఒక ప్రత్యేకత ఉందని, శ్రమ నుండి పాట పుట్టిందని, పాటలే ఉద్యమాలకు ఊపిరిగా నిలిచాయని పేర్కొన్నారు. పాటలతోనే ఎన్నో ఉద్యమాలు జరిగాయని, ప్రజలు అందరిని సమిష్టిపరిచే శక్తి ఒక పాటకే ఉందని, ఆటపాట లేకుండా ఉద్యమాలను ఊహించుకోలేమని ఆయన పేర్కొన్నారు.

జెవివి జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.విశ్వనాథం, జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.చక్రపాణి, మైదుకూరుకు చెందిన ఇంద్రజాలికుడు హరే రామ్, జెవివి రాష్ట్ర నాయకులు గంద్రేటి లక్ష్మణరావు, గంద్రేటి అప్పలనాయుడు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్ గంద్రేటి శ్రీను, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మిరియాల కృష్ణారావు, జిల్లా కోశాధికారి షిణగం శివాజీ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్లో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలికలు హాస్టల్, సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌ని వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ శనివారం సందర్శించారు. ప్రిన్సిపాల్ ఎన్.వి.ఎస్.లక్ష్మీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పిల్లలకి ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. సేఫ్టీ డ్రింకింగ్ వాటర్ ఉందా, లేదా హాస్టల్ కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, టాయిలెట్స్, డార్మెట్రీ పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్‌లో ఈగలు, దోమలు రాకుండా మెస్‌లు అమర్చాలని తెలిపారు. తాగే నీటిని ప్రతీ వారం తనిఖీలు చేయించాలని తెలిపారు. గిరిజన ప్రాంతాలు నుండి వచ్చిన విద్యార్థులకి ఫీవర్ స్క్రీనింగ్ చేసి, మలేరియా అర్‌డీ కిట్స్ ద్వారా టెస్టులు చేయించి ఉచితంగా మందులు అందించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, పచ్చకామెర్లు, డయేరియా వ్యాధులు, వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య సహాయకులు సత్యారావు తగు సలహాలు ఇచ్చారు. వ్యక్తి గత పరిశుభ్రత, చేతులు పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్స్, భయట నిల్వ ఆహార పదార్థాలు తినరాదని తెలిపారు. ఈఎన్‌టి, డెంటల్, స్కిన్, సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి ఈశ్వరరావు, హెచ్‌వి. పద్మావతి, హెచ్ఎస్. ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, హాస్టల్ వార్డెన్ పద్మావతి, స్టాఫ్ నర్స్ దీప, ఆశ వర్కర్ గౌరీ పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా ?

బడ్డు కొండకు సవాల్ విసిరిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అభివృద్ధిపై బహిరంగ చర్చకు వస్తావా...? అని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండకు జనసేన నాయకులు సవాల్ విసిరారు. శనివారం భోగాపురం మండలంలోని జనసేన కార్యాలయంలో డెంకాడ ఎంపిపి వెంకట వాసుదేవరావు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును ఉద్దేశించి మీ ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని, మా ఏడాదిన్నరలో చేసిన పనులతో పోల్చి బహిరంగ చర్చకు రండి' అని సవాల్ విసిరారు. ఎంపిపి వాసుదేవరావుతో పాటు పిఎసిఎస్ మాజీ చైర్మన్ పతివాడ శ్రీను, సర్పంచ్ కోట్ల రఘు, దాడిశెట్టి శ్రీనివాసరావు, బాసి దుర్గా తదితరులు మాట్లాడుతూ ఎమ్మెల్యే లోకం నాగమాధవి అభివృద్ధికి చిరునామా అని చెప్పారు. అప్పలనాయుడు 2009కు ముందు ఎంత ఆస్తి కలిగి ఉన్నారు, ఇప్పుడు ఎంత ఉందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ పదవులను అక్రమార్జన కోసం వాడుకున్నారని ఆరోపించారు. బొత్స లేకపోతే నీ బతుకు ఎంత? అంటూ ఎద్దేవా చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎమ్మెల్యే అభివృద్ధికి ఒక రెఫరెండం అవుతాయని తెలిపారు. జనసేన నాయకులు లోకం ప్రసాద్ ఒక పత్రికపై విరుచుకుపడ్డారని దాన్ని మీడియా అంతటికి రుద్దే ప్రయత్నం జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో జనసేన కోఆర్డినేటర్ జమరాజు, బాల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ ఈనాడు దేశంలో, రాష్ట్రంలో బాలికలు విద్యను అభ్యసించడంలో మెరుగుదల ఉన్నప్పటికీ 10 వతరగతిలోనే ఎక్కువ మంది బాలికలు పై చదువులకు వెళ్ళకుండా ఆగిపోతున్నారన్నారు. ఇది బాలికా విద్యకు ఆటంకమైందన్నారు. లింగ వివక్షత, అక్షరాస్యత, అసమానతలు, లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఐక్యరాజ్యసమితి కూడా హెచ్చరించిందని గుర్తు చేశారు. ప్రధానంగా అన్ని రంగాలలో మహిళల సాధికారత ఉంటే బాలికల స్థితిగతులు బాగుంటాయని అన్నారు. బాల్య వివాహాలు నేటి సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. వీటన్నింటినీ ఎదుర్కోవడంలో బాలికలు, మహిళలు చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, శిరీష్, శివ, రవి విద్యార్థినులు పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలో శనివారం అంగన్‌వాడి కార్యకర్తల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేపాడ వల్లంపూడి అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి - వంగర

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పంట కోత ప్రయోగాలపై గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులకు, గ్రామ రెవెన్యూ అధికారులకు మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్ అధ్యక్షతన శనివారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పిన్నింటి పిన్నింటి రామారావు మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలకు సంబంధించి ఫీల్డ్ సెలక్షన్ విఆర్‌ఒలు, విఎఎలు సమన్వయంతో కలిసి పూర్తి చేయాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి టి.కన్నబాబు మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల ముఖ్య ఉద్దేశం రైతు పంటల ఉత్పత్తి అంచనాలు కచ్చితంగా తెలుసుకోవడం అన్నారు. ఫసల్ బీమా పథకం కింద నష్టం అంచనా వివరాలు సరైనవిగా నిర్ధారించుకోవడం అన్నారు. మండలంలోని 84 వరి పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తామన్నారు. ఈ పంట నమోదుకు సంబంధించి అన్ని ల్యాండ్ పార్సిల్‌ను ఈనెల 25వ తేదీలోగా పూర్తిచేయాలని ల్యాండ్ పార్సిల్స్ వెరిఫికేషన్‌లో ఏమైనా ఇబ్బంది ఉంటే గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు వ్యవసాయ సిబ్బందికి సహకరించాలని తహశీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై 13న ఆందోళన : వైసిపి

ప్రజాశక్తి - చీపురుపల్లి

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ముఖ్యమంత్రి దగ్గర నుండి మంత్రి లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో కల్తీ మద్యం కుటీర పరిశ్రమలా కొనసాగుతుందని వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు మీసాల వరహాల నాయుడు, నియోజకవర్గం విభజన అధ్యక్షుడు బెల్లాన వంశీ తదితరులు ఆరోపించారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం కారణంగా వేలాది కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి వీధిన పడ్డాయన్నారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 13న నియోజకవర్గ కేంద్రంలో కల్తీ మద్యంపై నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు, సర్పంచులు, జెడ్‌పిటిసిలు, వైసిపి కార్యకర్తలు అంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- బాడంగి

బొబ్బిలి - తెర్లాం రోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు రాజా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎస్‌సిఐ నిధుల నుండి తెర్లాం రోడ్డుకు రూ.4.5 కోట్లు, ఆకులకట్ట రోడ్డుకు రూ.2.9 కోట్లు మంజూరయ్యాయని చెపారు. నియోజక వర్గంలో ఎప్పటి నుంచో ఉన్న రోడ్డు సమస్యలకు పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ పారాది వంతెన పనులు పూర్తికానందున, వర్షా కాలంలో భారీ వాహనాలను అలజంగి, తెర్లాం మీదుగా మళ్ళించాల్సి వస్తుందనే కారణంగా 'బొబ్బిలి - తెర్లాం', 'బొబ్బిలి పట్టణ' రోడ్డు పనులు ప్రారంభించలేదని చెప్పారు. ఇప్పుడు వర్షాలు తగ్గుముఖం పట్టినందున, ముందుగా 'బొబ్బిలి - తెర్లాం' రోడ్డు (రేజేరు మీదుగా) పనులకు శంకుస్థాపన చేశామని తర్వలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, బొబ్బిలి మండల టిడిపి అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, బాడంగి మండల అధ్యక్షులు తెంటు రవి, అలజంగి సర్పంచ్ ప్రతినిధి రేజేటి బుజ్జి, బడే జానీ, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ఈ నెల 15వ తేదీన తలపెట్టనున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పి.శంకర్రావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయ గ్రామ సహాయకుల సమావేశ మందిరంలో ఆసంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 27 వేల మంది గ్రామ రెవెన్యూ సహాకులు గత ఎనిమిదేళ్లగా జీతాలు పెరగపోవడంతో కుటుంబాలు అర్ధాకలితో బతుకుతున్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచి విఆర్ఎ కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, విఆర్ఒ, అటెండర్, వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్ తదితర ఖాళీ పోస్టులు భర్తీలని, విఆర్ఎలకు 70శాతం పోస్టులు కేటాయించాలని నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని తదితర డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ 15 విజయవాడ ధర్నాలో విఆర్ఎలు పెద్ద ఎత్తున పాల్గొవాలని తెలియజేశారు. ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శిలు పి.లక్షణరావు, జి.అప్పారావు, వి.రామారావు ఆర్.లాజరు, పి. భాస్కరరావు, నక్షత్ర ఏ నక్షత్రమ్మ, జి గంగమ్మ విఆర్ఎలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పి దామోదర్ శనివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిశుభ్రంగా ఉంచుకోవడం, క్లీన్ అండ్ గ్రీన్ మెయింటైన్ చేయడం, కేసులపై ఇన్వెస్టిగేషన్ గురించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ బి.నారాయణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - కంటోన్మెంట్

పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదన్నా సంబంధాలు చూడటంతో మనస్థాపానికి గురైన యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. పట్టణంలోని బాబామెట్టలో నివాసముంటున్న బెహర ఈశ్వరరావు కుమార్తె రమ్య(19) డిగ్రీ చదువుతోంది. కుటుంబ సభ్యులు రమ్యకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. పెళ్లి ఇప్పుడే చేసుకోవడం ఇష్టం లేదని పలుమార్లు కుటుంబ సభ్యులకు తెలిపినా వినకపోవడంతో శుక్రవారం సాయంత్రం సైకిల్‌పై ఇంటి నుంచి బయటకు వచ్చేసి అయ్యకోనేరు గట్టు వద్ద సైకిల్ పెట్టి చెరువులకు దూకింది. కుటుంబ సభ్యులు చుట్టూ వెతికి అయ్య కోనేరు గట్టుపై సైకిల్‌ను గుర్తించి శనివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సాయంత్రం రమ్య మృతదేహం అయ్య కోనేరులో తేలింది. స్థానికులు చూసి విజయనగరం టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. టూ టౌన్ ఎస్ ఐ కనకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ జెడ్‌పిటిసి పెదబాబు మృతి

ప్రజాశక్తి - జామి రూరల్




మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు(65) జామిలోని ఆయన స్వగృహంలో శనివారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందారు. రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, నాయకులు కొండలరావు పెదబాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జిల్లా నలుమూలల నుంచి అభిమానులు తరలి వచ్చారు. జామి ప్రాంతానికి, ముఖ్యంగా తాటిపూడి ఆయకట్టు రైతులు సమస్యలు, బీమసింగి షుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతులు సమస్యలపై, గ్రీన్ ఫీల్డ్ రహదారి రైతులు సమస్యపై, జామి అగ్రహారం రైతులు భూమి హక్కులపై పోరాటం చేశారు. తాటి పూడి ఆయకట్టు దారుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ రాయవరపు సత్యం, కో కన్వీనర్ లోకవరపు ఆదినారాయణ మూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఆంధ్ర ప్రదేశ్ పాల రైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు గొంప కృష్ణమూర్తి, బీమసింగ్ షుగర్ చెరుకు రైతుల సంఘం అధ్యక్షుడు చలుమూరి వెంకట రావు, గ్రీన్ ఫీల్డ్ రహదారి పోరాట కమిటీ కో కన్వీనర్ గుళిపిల్లి గంగు నాయుడులు సంతాపం వ్యక్తం చేశారు.

చీపురుపల్లిలో చోరీ..

◆10 తులాల బంగారం, కేజిన్నర వెండి, రూ.2.50 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లి పట్టణం ఆంజనేయపురంలో గల మదర్ థెరీసా స్కూలు సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ఉపాధ్యాయుడి ఇంటిలో భారీ చోరీ జరిగింది. ఈ చోరీకి సంబంధించి బాధితులు వమ్మీ సురేష్ దంపతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాంలోని మా బంధువుల ఇంటిలో పెళ్లి నిమిత్తం శుక్రవారం ఉదయం 11 గంటలకు చీపురుపల్లి నుంచి వెళ్లాం. పెళ్లి వేడుక ముగించుకుని తిరిగి అదే రోజు అర్ధరాత్రి ఒంటి గంటన్నర సమయంలో ఇంటికి చేరుకొన్నాం. అయితే ఇంటి మెయిన్ గేటు తీసుకొని ఇంటిలోనికి ప్రవేశించే సమయానికి ప్రధాన ద్వారం తలుపులు నెట్టాం. ఆ తలుపులు ఎంతకీ రావుకపోవడంతో అనుమానం వచ్చి ఉఇంట్లో ఎవరో ఉన్నట్లు గుర్తించాం. దీంతో అదే వీధిలో నివాసం ఉంటున్న నా తమ్ముడు రమేష్‌తో పాటు మరికొంతమందికి ఫోన్ చేశాను. ఇది గమనించిన దొంగలు అప్పటికే దొంగలించిన సామాన్లతో వెనుక ద్వారం నుంచి పరారైపోయారు. ఇంటి పక్క భాగం నుంచి కిటికీలను తొలగించి ఇంటిలో చొరబడి సుమారు పది తులాల బంగారం, రెండున్నర లక్షల రూపాయల నగదు, కిలోన్నర వెండి వస్తువులను దుండగులు చోరీ చేశారు అని ఇంటి యజమాని సురేష్ తెలిపారు. ఈ ఘటనలో దోపిడీకి పాల్పడిన వ్యక్తి పాదరక్షలను దొంగతనం చేసిన ప్రాంతంలోనే విడిచి వెళ్లిపోయాడని బాధితులు వివరించారు. సంఘటన జరిగిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందజేయడంతో ఎస్ఐ ఎల్ దామోదర్ రావు సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు. అప్పటికే దొంగతనం చేసిన వారు పరారి కావడంతో శనివారం ఉదయం డాగ్ స్క్వాడ్, వేలిముద్ర నిపులను రప్పించి ఆధారాలు సేకరించారు. తన కుమార్తె వివాహం కోసం దాచి ఉంచిన బంగారాన్ని దుండగులు దోచుకెళ్లారంటూ బాధితుడు సురేష్ వాపోయారు. తాము దాచుకున్న రెండున్నర లక్షల నగలతో పాటు కేజీన్నర వెండిని కూడా అపహరించారని బాధితులు వివరించారు. ఈ మేరకు చీపురుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇదే వీధిలో సురేష్ ఇంటి పక్కనే ఉంటున్న అపార్ట్మెంట్లో కూడా గత కొన్నాళ్ళు కితం ఈ తరహాలోనే కిటికీ గ్రిల్స్ తప్పించి భారీ దోపిడీ చేశారు. కొత్త వీధిలో కూడా ఈ తరహాలోనే సిద్ధార్థ హై స్కూల్‌కి ఎదురుగా ఉన్న ఎర్నేని లక్ష్మణరావు ఇంట్లో కూడా కిటికీ గ్రిల్స్ తప్పించి ఇంటిలో ఉన్న వెండి వస్తువులను దుండగులు దొంగలించారు. చీపురుపల్లిలో వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



ఆధారాలను సేకరిస్తున్న క్లూస్‌టీమ్ బృంద సభ్యుడు

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS AT VIZIANAGARAM
ARBITRATION CLAIM PETITION NO.49/2024

BETWEEN:
M/S Shriram Chits Pvt Ltd,
Vizianagaram Branch-II, Rep by its
Junior Manager- Legal cum GPA Holder
.... **DISPUTANT**

VERSUS
SUBSCRIBER
K.Eswarara Rao & 3 others
GUARANTOR
OP3) Jami Gowri Sankar, S/o.Satyam, Hindu, aged about 39 years, R/o. D.No.2-157, Dwaraka nagar, Jonnada, Nr: Iynada, Vizianagaram.
OP4) Mr. Rokkam Mohan Rao, S/o (Late) Jagannadharao, Hindu, aged about 43 years, Resident at Q.No.8, Police Quarters, S.Kota, Vizianagaram. . . . **OPPONENT S**

NOTICE

పై నెంబరు దావా మీ నుండి దావా సొమ్ము మరియు ఖర్చులు రాబట్టుకొనే నిమిత్తం పై ఆర్బిట్రేటర్ వద్ద వాది దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో తే 21-10-2025 ది ఉ॥ గం॥ 10.30 గం॥లకు పై కోర్టులో మీరు స్వయంగా గాని లేదా లాయరు ద్వారా గాని హాజరై మీ వాదన తెలియజేసుకోవలెను. లేని యెడల ఆర్బిట్రేటర్ వారు పైదావా మీ పరోక్షమున తీర్మానించడ మగునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

డివిజినల్ మేనేజర్
శ్రీరామ్‌చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, విజయనగరం

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS AT VIZIANAGARAM
ARBITRATION CLAIM PETITION NO.29/2024

BETWEEN:
M/S Shriram Chits (India) Pvt Ltd,
Vizianagaram Branch-I, Rep by its
Junior Manager .... **DISPUTANT**

VERSUS
SUBSCRIBER
A.Krishna Murthy & others
GUARANTOR
OP4) Kodali Krishna Kanth, S/o Samba Siva Rao, Hindu, aged about 32 years, he is maintained Pride Bream, Opp:Puvvada School, Ring Road, Vizianagaram(dist)
. . . **OPPONENT**

NOTICE

పై నెంబరు దావా మీ నుండి దావా సొమ్ము మరియు ఖర్చులు రాబట్టుకొనే నిమిత్తం పై ఆర్బిట్రేటర్ వద్ద వాది దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో తే 21-10-2025 ది ఉ॥ గం॥ 10.30 గం॥లకు పై కోర్టులో మీరు స్వయంగా గాని లేదా లాయరు ద్వారా గాని హాజరై మీ వాదన తెలియజేసుకోవలెను. లేని యెడల ఆర్బిట్రేటర్ వారు పైదావా మీ పరోక్షమున తీర్మానించడ మగునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

డివిజినల్ మేనేజర్
శ్రీరామ్‌చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, విజయనగరం